సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం | 6 | ఫిబ్రవరి | 2024



పోలీసుల అదుపులో చిట్‌ఫండ్ యాజమాన్యం? - 8లో▸

కనకదుర్గ చిట్‌ఫండ్ డైరెక్టర్ నల్ల భాస్కర్ రెడ్డి (35) ఆత్మహత్య కేసులో పోలీసులు యాజమాన్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



భవ్య కుటుంబీకుల రాస్తారోకో

భవ్య మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బుధరావుపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0°/21.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

క్యాలెండర్ ఆవిష్కరణ



కాటారం : తెలంగాణ గవర్నమెంట్ పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్(టీజీపీఎల్‌ఏ) ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్యాలెండర్‌ను సోమవారం సంఘం నాయకులతో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఇటీవల జరిగిన క్రమబద్ధీకరణలో అన్ని అర్హతలు కలిగి ఉన్నప్పటికీ మిగిలిన 15 మంది ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని సంఘం నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ సెక్రటరీతో మాట్లాడి లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, ప్రిన్సిపాల్ గోవర్ధన్, మెకానికల్ విభాగాధిపతి కృష్ణ, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, టీజీపీఎల్‌ఏ ఉపాధ్యక్షుడు పూర్ణసాయికిరణ్, సంయుక్త కార్యదర్శి రవికుమార్, నాయకులు కిరణ్‌భాస్కర్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిని మెరుగుపర్చాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్స్ బొగ్గు ఉత్పత్తిని మెరుగు పర్చాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఏరియాలోని కేటీకే 1వ గనిలో సోమవారం మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్స్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీఎం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, మిషనరీల పనితీరు, ఉత్పత్తి వ్యయం లాంటి విషయాల గురించి వివరించారు. టీమ్ సభ్యులు ప్రాజెక్ట్ అధికారులు తమ గనులు, విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, రామకృష్ణారెడ్డి, తుకారాం, రాజశేఖర్, సురేఖ, వెంకట్‌రావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పే స్కేల్ అమలుచేయాలని వినతి

భూపాలపల్లి రూరల్: సోషల్ ఆడిట్ ఎంప్లాయీస్‌కు పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును సోషల్ ఆడిట్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సీఎంకి రిప్రజెంటేషన్ లెటర్ పంపిస్తానని హామీచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు సాంబ శివచారి, సురేష్, రఘు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

న్యాయ సేవలపై అవగాహన



భూపాలపల్లి అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని జంగేడులో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో న్యాయ అవగాహన పెంచడం కోసం సోమవారం న్యాయవాదులు, సిబ్బందితో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రియాంక, ప్యానెల్ అడ్వకేట్ అబ్దుల్ కలాం ఆజాద్‌లు ప్రజలతో మాట్లాడారు. స్థానికులకు ఉచిత, సత్వర సమాన న్యాయం అందించడమే న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమన్నారు. జిల్లా ప్రజలకు న్యాయపరమైన సహాయం కావాలంటే భూపాలపల్లి బస్సు డిపో పక్కన ఉన్న జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయసేవాధికార సంస్థను నేరుగా సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణపురం పీఏసీఎస్ హస్తగతం



గణపురం : గణపురం పీఏసీఎస్ చైర్మన్ పదవిని అధికార కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానంతో ఎట్టకేలకు హస్తగతం చేసుకుంది. బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డిపై 12 మంది సభ్యులు అవిశ్వాసం ఇవ్వగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీసీఓ ఆధ్వర్యంలో సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది సభ్యులు ఓటు వేశారు.దీంతో బీఆర్‌ఎస్ పార్టీ చైర్మన్ పదవిని కోల్పోయింది.

ఇన్‌చార్జ్ కమిషనరే దిక్కు..

భూపాలపల్లి మున్సిపాలిటీకి రానంటున్న కమిషనర్లు

- ఇప్పటికే ఇద్దరిని సరెండర్ చేయించిన పాలకవర్గం
- ఏడాదిన్నర కాలంగా ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఎంపీడీఓకు అదనపు బాధ్యతలు



పని చేయలేం బాబోయ్..

ఏడాదిన్నర కాలంగా మున్సిపాలిటీ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ ఇతర మున్సిపాలిటీల నుంచి సీడీఎంఏ అధికారులు బదిలీ చేసినా రావడం లేదు. అధికార, ప్రతిపక్ష నాయకుల ఒత్తిడిలు, ఇక్కడ ఉన్నటువంటి సమస్యలను తట్టుకొని పని చేయడం కష్టతరంగా ఉంటుందని ఎవరూ భూపాలపల్లికి వచ్చేందుకు ధైర్యం చూపడం లేదు. అంతేకాకుండా మున్సిపాలిటీ శాఖలకు సంబంధం లేని ఎంపీడీఓకు అదనపు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి పాలన సాగిస్తున్నారు. దీనిపై కలెక్టర్ నుంచి ఎటువంటి స్పందన లేకుండా పోయిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

భూపాలపల్లి అర్బన్: దినదినం అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయానికి ఏదో గ్రహణం పట్టింది. భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా పూర్తి స్థాయిలో పనిచేయడం కష్టతరంగా మారింది. బదిలీపై వచ్చిన కమిషనర్లు అనేక ఒత్తిడిల కారణంగా ఎక్కువ రోజులు విధులు నిర్వర్తించలేకపోతున్నారు. ధైర్యం చేసి విధులు నిర్వర్తించినా పని చేయనియకుండా ప్రభుత్వానికి సరెండర్ చేయాలని పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మాణాలు చేసి మరి పంపిస్తున్నారు. దీంతో గత ఏడాదిన్నర కాలంగా కమిషనర్ పోస్టు ఖాళీగా ఉన్న ఇక్కడ పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. భూపాలపల్లి ఎంపీడీఓకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఇద్దరు సరెండర్

గతంలో భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఇద్దరిని పాలకవర్గ సభ్యులు ఏకమై ప్రభుత్వానికి సరెండర్, బదిలీ చేయాలని తీర్మాణాలు చేశారు. గతంలో పని చేసిన ఇద్దరు కమిషనర్లను ఈవిధంగానే ఇక్కడి నుంచి పంపించారు. 2020 అక్టోబర్‌లో అప్పటి కమిషనర్ సమ్మయ్య, 2022 అగస్టు 29న బిర్రు శ్రీనివాస్‌లను ప్రభుత్వానికి సరెండర్ చేయించారు. అంతేకాకుండా 2019 సంవత్సరంలో కమిషనర్లుగా ప్రశాంతి 15 రోజులు, వేణు 2నెలలు, ఇన్‌చార్జ్ కమిషనర్లుగా గిరిధర్ 6 నెలలు, సుధీర్ 15 రోజులు, టీపీఓ అవినాష్ 8నెలల పాటు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పని చేశారు.

ఏడాదిన్నర కాలంగా..

జిల్లా కేంద్రం, పట్టణ పరిధిలో 30వార్డులు, లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఈ పట్టణానికి రెగ్యులర్ కమిషనర్ ఉండాల్సిన స్థానంలో గత ఏడాదిన్నర కాలంగా ఇన్‌చార్జ్ కమిషనర్‌తో పట్టణపాలన నడుస్తోంది. కమిషనర్ స్థాయి అధికారి కాకున్నా కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఎంపీడీఓలకు ఇన్‌చార్జ్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో పట్టణంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రజలకు సకాలంలో అందాల్సిన సేవలు అందడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.



భూపాలపల్లి మునిసిపాలిటీ కార్యాలయం

పాలకవర్గ ఒత్తిడే కారణమా..

మున్సిపాలిటీలో 30 వార్డులు ఉండగా గత ఎన్నికలకు ముందు 26మంది అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లే ఉన్నారు. మున్సిపాలిటీలో ఎటువంటి పని, బిల్లులు ఆమోదం, తీర్మాణం చేయడానికైన ఏకపక్ష పాత్ర పోషిస్తున్నారు. వీరు ప్రతిపాదించిన ప్రతీ పనిని చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పాలకవర్గ సభ్యులకు సహకరించకపోతే కమిషనర్, సిబ్బంది, అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చి బదిలీ, సరెండర్ చేయిస్తున్నారని పట్టణంలో బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల ఒత్తిడి కారణంగానే సక్రమంగా విధులు నిర్వర్తించకలేపోతున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్‌ఎస్ నుంచి కౌన్సిలర్లు వలస బాట పట్టారు. మళ్లీ అవే ఘటనలు పునరావృతం అవుతాయనే భయంతో భూపాలపల్లికి కమిషనర్‌గా వచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో పట్టణంలో అభివృద్ధి కుంటుపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

‘గృహజ్యోతి’కి డిస్కం సన్నద్ధం

- గృహాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్
- నేటి నుంచి తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ నమోదు

హన్మకొండ: ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహ జ్యోతి పథకం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈపథకం కింద గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలులో ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు అమల్లోకి వచ్చాయి. ఇటీవల మరో రెండు పథకాలు అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు గృహజ్యోతి పథకం అమలుకు వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్‌ను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించింది. దీంతో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ డిస్కంలకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

నేటి నుంచి ప్రక్రియ షురూ..

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లోని 16 జిల్లాల్లో 45,64,889 మంది గృహ వినియోగదారులున్నారు. ఈనెల 6 నుంచి బిల్లులు తీస్తున్నప్పుడే మీటర్ రీడింగ్‌తో పాటు వినియోగదారులను కలిసి రేషన్ కార్డు, ఆధార్ నంబర్ తీసుకుని నమోదు చేయాలని సూచించారు. ఈమేరకు సిద్ధం చేస్తున్న సాఫ్ట్‌వేర్ మంగళవారం(నేడు) ఉదయానికి అందుబాటులోకి రానుంది. ప్రతి ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం(ఈఆర్‌ఓ)లో ఉదయం 9 గంటలకు స్పాట్ బిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, డివిజన్ ఇంజనీర్లు సాఫ్ట్‌వేర్ వినియోగం, మీటర్ రీడింగ్, రేషన్ కార్డు, ఆధార్ నంబర్ల నమోదుపై అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో సీఎండీ.. జిల్లా ఎస్‌ఈలు, డీఈలు, అకౌంట్స్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈమేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో డివిజన్ల వారీగా సమావేశాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న అధికారులు మీటింగ్‌కు రావాలని స్పాట్ బిల్లర్లకు సమాచారం పంపారు. ఇదిలా ఉండగా.. అద్దెకు ఉంటున్న కుటుంబాల ఆధార్, రేషన్ కార్డు నంబర్ నమోదుపై అధికారులు సందేహాలు వ్యక్తం చేయగా నివృత్తి చేశారు. అద్దెకు ఉంటున్న ఇంటి మీటర్ నంబర్‌తో పాటు వారి రేషన్ కార్డు, ఆధార్‌నంబర్ నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియతో యజమానులకు ఎలాంటి సమస్యలు తలెత్తవని చెప్పారు. ప్రతి నెలా 15వ తేదీలోపు విద్యుత్ పంపిణీ సంస్థ బిల్లులు జారీ చేస్తుంది. ఈనెల 15వ తేదీ నాటికి తెల్ల రేషన్‌కార్డు వినియోగదారులు ఎంత మంది ఉన్నారో స్పష్టంగా తెలుస్తుంది.



జిల్లాల వారీగా గృహ వినియోగదారులు

జిల్లా	వినియోగదారులు
హనుమకొండ	3,45,302
వరంగల్	2,86,156
భూపాలపల్లి, ములుగు	1,93,257
జనగామ	1,69,375
మహబూబాబాద్	2,09,066

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఏటూరునాగారం: ఈనెల 4వ తేదీన ఖమ్మం జిల్లాలో నిర్వహించిన 11వ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ కరాటే పోటీలలో మండల పరిధిలోని రామన్నగూడెం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ కొయ్యడ మలయ్య తెలిపారు. మండల పరిధిలోని రామన్నగూడెం పాఠశాలలో కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. అండర్-14 కటాలో బాలికల విభాగంలో జి.గోపికలు గోల్డ్ మెడల్ సాధించారు. ఇర్సవడ్ల శరణ్య, కోడి లిఖితవ్య, అమృత, అక్షర సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ అబ్బు, సాయి, పాఠశాల హెడ్ మాస్టర్ మల్లయ్య విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు.

ప్రజావాణి వినతులకు పరిష్కారం చూపాలి

కలెక్టర్ భవేశ్‌మిశ్రా



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వచ్చి తమ సమస్యలకు సంబంధించిన 42 దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేయగా స్వీకరించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, డీఆర్‌డీఓ పురుషోత్తం, డీపీఓ ఆశాలత, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గణపురం : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని బుద్దారంలో రూ.3కోట్ల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.25లక్షల డీఎంఎఫ్ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తోందని, ప్రతీ ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ నరేష్, డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ అరుంధతి, వైస్ ఎంపీపీ అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రేపాక రాజేందర్, చొటేమియా, ఎంపీటీసీ కాలియాసాగర్, గండ్ర ఆగమరావు, సంగయ్య, రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సిద్ధం కావాలి



విద్యార్థుల పరీక్షను పరిశీలిస్తున్న భద్రయ్య

చిట్యాల: విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధం కావాలని డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ శనిగరపు భద్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాకతీయ హైస్కూల్‌ను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కావద్దన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో చదువుకుని పరీక్షలు రాసి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఏ రోజు జరిగిన పరీక్షలు ఆ రోజే మూల్యాంకనం చేసి విద్యార్థులకు మార్కులను తెలియజేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు. ప్రత్యేక తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అవగాహన కల్పించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థాయిలో నిలిచే విధంగా ఉపాధ్యాయులు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుర్ర సదయ్య, రాంనారాయణ, కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ ఎండీ.రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జీవహింసను అరికట్టాలి

పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీదేవి



బహుమతులతో విద్యార్థులు

చిట్యాల: జీవహింసను ప్రతిఒక్కరూ అరికట్టాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జీవహింస నివారణపై సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జంతు సంరక్షణకు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను అమలు చేయాలన్నారు. జంతువుల సంక్షేమానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు నివారణ సంఘాలను స్థాపించి కాపాడాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వెంకన్న, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత, పశువైద్య సహాయకులు నెహ్రూనాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభివృద్ధికి కృషి

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ఆత్మీయ అభినందన సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

కాటారం: మంథని నియోజకవర్గంలో ఉన్నత విద్యను మరింత అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి సమీపంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రూ.3 కోట్ల నిధులతో నిర్మించిన బాలుర హాస్టల్ భవనం, మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్మించిన డాక్టర్ క్వార్టర్స్, బర్త్ వెయిటింగ్ రూంను కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో కాటారంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో అభివృద్ధికి దూరమైన కళాశాలను పూర్తి స్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు కార్యచరణతో ముందుకెళ్తామన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. బాలికలకు సైతం హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కాటారం ఐటీఐ అప్‌గ్రేడ్ కోసం రూ.4 కోట్ల నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించినట్లు మంత్రి వివరించారు. మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ముందుస్థానంలో ఉంచుతామన్నారు. అనంతరం మంత్రికి పలువురు వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, డీఎంహెచ్‌ఓ మధుసూదన్, మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గోవర్ధన్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శంకర్ నాయక్, ఎంపీటీసీలు హట్కర్ రూప ఓంసింగ్, జాడి మహేశ్వరీ, బోడ మమతనరేష్, మహేశ్ రవీందర్‌రావు, జనార్దన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బాలుర హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ట్రాక్టర్ నడిపిన మంత్రి

స్థానిక కాంగ్రెస్ కార్యకర్త నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా డ్రైవింగ్ చేసి ప్రారంభించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభ అనంతరం కార్యకర్త కోరిక మేరకు మంత్రి ట్రాక్టర్ నడిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మహదేవపూర్/పలిమెల: మహదేవపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం పాల్గొన్నారు. అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని రూ.1.20కోట్లతో నిర్మించగా ప్రారంభించారు. అదే విధంగా రూ.24లక్షలతో ఐసీడీఎస్ భవనం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీకి రూ.23లక్షలతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. సూరారంలో అంగన్‌వాడీ కేంద్రం భవనానికి రూ.16లక్షలు, దసలి పట్టు చేనేత గదులు రూ.20లక్షలతో రెండు గదులు నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ భవేశ్ మిశ్ర, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, జిల్లా అధికారులు, ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పలిమెల మండల కేంద్రంలోని ఎంపీటీసీ దండెర కల్యాణి నివాసంలో సోమవారం రాత్రి మంత్రి శ్రీధర్‌బాబు పల్లెనిద్ర చేశారు.



విరబూసిన మామిడి పూత

మామిడి చెట్టంతా పూతతో విరబూసింది. సాధారణంగా మామిడికి పూత వచ్చే సీజన్ ఇది. దీంతో ప్రతి చెట్టు ఎంతో కొంత పూత వస్తుంది. కానీ ఈ చెట్టు నిండుగా విరబూసింది. కొత్తపల్లిగోరి మండల శివారు నుంచి జాకారం వెళ్లే ప్రధాన రోడ్డు వెంట మామిడి చెట్టు పూత విరగబూయడంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. మామిడి కొమ్మలు కనిపించకుండా ఉన్న పూత చూపరులను ఆకట్టుకుంటోంది. - రేగొండ

పారదర్శకంగా ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్, రాజకీయ పార్టీల నాయకులు

భూపాలపల్లి : జిల్లాలో నేటినుంచి ఈ నెల 9వ తేదీ వరకు పారదర్శకంగా ఈవీఎం యంత్రాలను ఎఫ్‌ఎల్‌సీ(ఫస్ట్ లెవల్ చెకింగ్) ఈసీఐఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాంలో తనిఖీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏడుగురు ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ వరకు ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ జరుగుతుందన్నారు. జిల్లాకు వచ్చిన 871 బ్యాలెట్ యూనిట్లు, 412 కంట్రోల్ యూనిట్లు, 509 వీవీ ప్యాట్ యంత్రాల పనితీరు పరిశీలించడం జరుగుతుందన్నారు. మూడురోజుల క్రితం అన్ని రాజకీయ పక్షాలకు సమాచారం అందించామని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ నిర్వహించడం జరుగుతుందని, యంత్రాలపై ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా ప్రక్రియ సాగుతుందని తెలిపారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్ ముగిసిన తర్వాత 1000 ఓట్లతో మాక్ పోలింగ్ నిర్వహిస్తామని, అప్పుడు కంట్రోల్ యూనిట్‌లో వచ్చిన ఓటు వివరాలు వీవీప్యాట్ స్లిప్పుల వివరాలను చెక్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఈసీఐఎల్ ఇంజనీర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూన్యాయ శిబిరాలు వాయిదా

పెద్దవంగర: రైతులకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేందుకు చేపట్టిన భూన్యాయ శిబిరాలను వాయిదా వేసినట్లు లీఫ్స్ సంస్థ సలహాదారు కేతిరెడ్డి కరుణాకర్ దేశాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలో ఈ నెల 7,8, బొమ్మకల్లులో 16,17, అలాగే, జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో 12,13 తేదీల్లో నిర్వహించనున్న భూన్యాయ శిబిరాలను మరో తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు సునీల్ కుమార్ తండ్రి సోమవారం కన్నుమూశారు. దీంతో న్యాయ శిబిరాలను వాయిదా వేస్తున్నట్లు కేతిరెడ్డి వెల్లడించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

బచ్చన్నపేట : మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిసింది. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

జువైనల్ హోమ్‌కు బాలుడి అప్పగింత

నెల్లికుదురు: బాలిక ఆత్మహత్యకు కారణమైన ఓ బాలుడిని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపారు. ఇనుగుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సెల్‌ఫోన్‌కు నెల్లికుదురు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నిత్యం అసభ్యకర మెస్సేజ్‌లు పంపుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక గత నెల 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటనలో బాలిక మృతికి కారణమైన బాలుడిని సోమవారం వరంగల్‌లోని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నర్సింహులపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై గండ్రాతి సతీష్ కథనం ప్రకారం నర్సింహులపేటకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వేముల ప్రభాకర్‌రెడ్డి తన భార్యతో కలిసి 15 రోజుల క్రితం విజయవాడలో ఉంటున్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని లాకర్‌లో ఉన్న 8 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



సారలమ్మ గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్



ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం జాతర
- మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క
- అధికారులతో సమీక్ష సమావేశం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం మేడారంలోని హరితహోటల్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఆర్టీసీ ఎండీ సజ్జనార్..అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మేడారం.. దేశంలోనే పెద్ద వన జాతరని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జాతరకు 6 వేల ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జాతర నిర్వహిస్తామన్నారు. 16వ తేదీ నుంచి ఆర్టీసీ క్యాంప్ భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు. జాతర సమయంలో సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ ఎండీ ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు జాతర సమయంలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మేడారం జాతరలో ఆర్టీసీ.. ఇప్పటి వరకు లక్షా పదివేల మంది భక్తులకు సేవలు అందించిందని తెలిపారు. 70 వేల మంది మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సేవలు వినియోగించుకున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మహాద్భుత ఘట్టం మేడారం జాతరని, భక్తుల సౌకర్యార్థం రూ. 105 కోట్లతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పీఓ అంకిత్, ఎస్పీ శబరీశ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మేడారం ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగు లహరి నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులను మంత్రులు పొన్నం, సీతక్క ప్రారంభించారు. అనంతరం వీఐపీ పార్కింగ్ వరకు బస్సులో ప్రయాణించారు.

ఆర్టీసీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

మేడారంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే బస్సులు, పార్కింగ్ స్థలాలు, బస్ షెల్టర్లు, క్యూలైన్ వార్డులు, ఆర్టీసీ ఉద్యోగుల షెల్టర్లు, తదితర వివరాలను ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు డోలువాయిద్యాలతో మంత్రులు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని సన్మానించి ప్రసాదం అందజేశారు.

భవ్య కుటుంబీకుల రాస్తారోకో

- తప్పుడు ప్రచారంపై ఆగ్రహం



రాస్తారోకో చేస్తున్న భవ్య కుటుంబ సభ్యులు

ఖానాపురం: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో అనుమానాస్పద స్థితిలో ఇరువురు విద్యార్థినులు మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన కోడి భవ్య మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చి జిల్లేడు చెట్టుతో వివాహం జరిపించి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం భవ్య మృతికి కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆటోడ్రైవర్‌తో పాటు వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే రాస్తారోకో వద్దకు చేరుకుని స్పష్టమైన హామీ ఇవ్వాలని బైఠాయించారు. మృతదేహంతో రోడ్డుపైనే నిలవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై మాధవ్‌గౌడ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో భవ్య అనారోగ్యంతో మృతి చెందిందని తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేను పిలిపిస్తేనే రాస్తారోకో విరమిస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

వారిని శిక్షించండి..

'నా కూతురును చంపిన వారిని చంపేయండి.. అన్యాయంగా నా బిడ్డను పొట్టనబెట్టుకున్నారు..నా బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయి..అందరు కలిసి మా కుటుంబానికి అన్యాయం చేత్తాండ్లు.. నా బిడ్డ ఒంటిపై దెబ్బలు ఉన్నాయి. చంపినోళ్లను వదిలేయవద్దంటూ' భవ్య తల్లి లలిత రోదించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. నా బిడ్డను చంపినవారిని వదిలేయొద్దు. వారిని కఠినంగా శిక్షిస్తేనే నా బిడ్డ ఆత్మ శాంతిస్తదంటూ బోరున విలపించారు. కాగా, ఎస్సై మాధవ్‌గౌడ్.. భవ్య అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు.

కుక్కల దాడి.. 25 గొర్రెల మృత్యువాత

- రూ.2.50 లక్షల నష్టం

వేలేరు : మండలంలోని శాలపల్లి శివారు లక్ష్మీతండా గ్రామంలో కుక్కల దాడిలో గుగులోత్ చిరంజీవికి చెందిన 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడి కథనం ప్రకారం.. రోజుమాదిరిగానే గొర్రెల మందను తన వ్యవసాయ బావివద్ద కొట్టంలో ఉంచాడు. చిరంజీవి సోమవారం ఉదయం ఇంటికి వెళ్లగా కొట్టం వద్ద ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 25 గొర్రెలు మృత్యువాత పడగా మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. మృత్యువాత పడిన గొర్రెల విలువ సుమారు రూ.2.50 లక్షల వరకు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కాగా, గ్రామంలో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



హైనా దాడిలో దూడ..

తరిగొప్పుల: హైనా దాడిలో లేగదూడ మృత్యువాత పడింది. మండల కేంద్రానికి చెందిన పింగిళి యాదిరెడ్డి పశువుల పాకపై సోమవారం తెల్లవారుజామున హైనా దాడి చేసి అందులో ఉన్న లేగదూడను హతమార్చింది. కాగా, కొద్ది రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో హైనా దాడి చేసి దూడలను హతమారుస్తుండడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.అటవీ శాఖ అధికారులు స్పందించి హైనాను బంధించాలని కోరుతున్నారు.



గొర్రెల కళేబరాలు

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- పూజలు.. మేకపిల్ల బలి
- పెద్దపహాడ్‌లో అర్ధరాత్రి హల్‌చల్..
- రెండు బైక్‌లు వదిలి కారులో పరార్
- 100 డయల్‌కు ఫోన్.. పోలీసుల విచారణ
- అదుపులో ఇద్దరు వ్యక్తులు



తవ్వకాలు చేపట్టిన గుంతలో మేక పిల్ల

జనగామ: జనగామ మండల పరిధి పెద్దపహాడ్ గ్రామం వెంకిర్యాలకు వెళ్లే దారి.. దండు సిద్దులు, కాటబోయిన రాములు వ్యవసాయ బావి వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు మాట్లాడుకుంటున్నారు. రెండు బైక్‌లు, ఓ కారులో అక్కడికు వచ్చిన వ్యక్తులు గతంలో ఉన్న గుంతలో నిమ్మకాయలతో పూజలు చేసి మేక పిల్లను బలిచ్చి అందులో వేశారు. సిద్దులు స్నేహితుడు అదే రోజు రాత్రి వెంకిర్యాలకు వెళ్తుండగా వ్యవసాయ బావి వద్ద కారు, బైక్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో సమీపానికి చేరుకున్నాడు. మనుషుల కదలికలు కనిపించడంతోపాటు పాకలో ఉన్న పశువులు బయటకు వచ్చి అరుస్తుండగా.. సిద్దులుకు గ్రామస్తులకు ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్నారు. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లు అక్కడే వదిలేసి కారులో పారిపోయినట్లు సిద్దులు తెలిపారు. 100 నంబర్‌కు డయల్ చేయగా పోలీసులు వచ్చి విచారణ చేపట్టి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఇదే ప్రదేశంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగ్గా.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజా సంఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఎస్సై సృజన్ మాట్లాడుతూ గుప్త నిధుల కోసం తవ్వకాలు చేయలేదని, ఇంట్లో కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో అడవిలో పూజలు చేసినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తుల ఇళ్లలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నట్లు వెల్లడించారు.

పోలీసుల అదుపులో చిట్‌ఫండ్ యాజమాన్యం?

- మృతుడు, డైరెక్టర్ భాస్కర్ రెడ్డి సూసైడ్ నోట్ లభ్యం
- దీని ఆధారంగా తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి అరెస్టు!
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

వరంగల్ క్రైం/ హసన్‌పర్తి : కనకదుర్గ చిట్‌ఫండ్ డైరెక్టర్ నల్ల భాస్కర్ రెడ్డి(35) ఆత్మహత్య కేసులో పోలీసులు యాజమాన్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన భాస్కర్‌రెడ్డి (35) మృతి కేసు పలు మలుపులు తిరిగింది. తన ఆత్మహత్యకు కనకదుర్గ చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి కారణమంటూ భాస్కర్‌రెడ్డి సూసైడ్ నోట్ లభించడం సంచలనంగా మారింది. సూసైడ్ నోట్‌లో చిట్‌ఫండ్ యాజమాన్యం కారణమని ఉండడంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు కేయూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కమలాకర్‌రెడ్డిని కేయూ పోలీసులు అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీసులకు అప్పగించారు. కాగా, రాగిడి తిరుపతిరెడ్డి మోసం కారణంగా భాస్కర్ రెడ్డి మృతి చెందాడని, ఈ ఘటనపై తిరుపతిరెడ్డిపై చర్యలు తీసుకుని కష్టమర్ల డిపాజిట్లను వెంటనే తిరిగి ఇవ్వాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ అంత్యక్రియలు జరమని తేల్చి చెప్పడంతో పోలీసులు చొరవ తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో భాస్కర్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, చిట్‌ఫండ్ యాజమాన్యం పోలీసులు అదుపులో ఉన్నప్పటికీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం ధ్రువీకరించడం లేదు. ఈ విషయంపై సుబేదారి సీఐ షుకుర్‌ను వివరణ కోరగా భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు సూసైడ్ నోట్ అందజేశారన్నారు. దీంతో ఈ కేసులో సెక్షన్లు మార్పు చేశామన్నారు. భాస్కర్‌రెడ్డి ఆత్మహత్యకు యాజమాన్యమే కారణమనే ఆరోపణలపై వారిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

కాజీపేట జంక్షన్‌లో అయోధ్య రైలు



కాజీపేటలో అయోధ్య రైలు వద్ద రైల్వే అధికారులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్–అయోధ్య వెళ్లే ప్రత్యేక రైలు సోమవారం సాయంత్రం 6:40 గంటలకు చేరుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్యూరిటీ రీజన్స్ దృష్ట్యా ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేశ్‌కుమార్, కాజీపేట సీఐ సంజీవరావు, కాజీపేట స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ, రైల్వే సీసీఐ సజ్జన్‌లాల్, అన్ని విభాగాల సూపర్‌వైజర్లు, రైల్వే అధికారులు, మెకానిక్ సిబ్బంది ప్రత్యేక రైలు వద్దకు చేరుకున్నారు. 6:55 గంటలకు బయల్దేరి వెళ్లింది. కాగా.. ఈ రైలులో కాజీపేట జంక్షన్ నుంచి ఎవరూ ఎక్కలేదని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల ప్రారంభం

కాజీపేట జంక్షన్ నుంచి కాజీపేట–అయోధ్య వరకు మంగళవారం నుంచి ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రారంభించనున్నారు. ఈమేరకు మంగళవారం అయోధ్య రైలును ప్రారంభించి పంపించే ఏర్పాట్లలో ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈరైలు కాజీపేట జంక్షన్ నుంచి మంగళవారం సాయంత్రం 6:20 గంటలకు బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు. 20 బోగిలతో కూడిన ఈప్రత్యేక రైలులో ఉమ్మడి జిల్లా నుంచి 1,300 మంది ప్రయాణికులు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. బీజేపీ నాయకులు, అధికారులు అయోధ్య ప్రత్యేక రైలు అధికారికంగా పంపించే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి అయోధ్యకు ప్రయాణికులు వెళ్లనున్నట్లు తెలిపారు. కాజీపేట–అయోధ్య, అయోధ్య–కాజీపేట (07223/07223) మధ్య 30 రైళ్ల సర్వీస్‌లను మార్చి 2వ తేదీ వరకు ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ మధ్య ప్రత్యేక రైళ్లు

- ఈ నెల 8 నుంచి అమలు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ స్టేషన్ వరకు 16 రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకు, సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ (04121) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు 18.00 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా ఈ నెల 10వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ (04122) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం కాజీపేటకు ఉదయం 8.00 గంటలకు చేరుకుటుంది. ఈ రైలుకు కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో నాగపూర్, బల్లార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

రూ.200 కోట్లతో 'టెక్నికల్ హబ్'

- కార్యరూపం దాల్చనున్న మంత్రి సురేఖ కృషి
- తెలంగాణలో ఏకైక టెక్నికల్ సెంటర్

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో రూ.200 కోట్ల వ్యయంతో టెక్నికల్ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన కృషి ఫలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా.. వాటిలో ఒక హబ్ ఖిలా వరంగల్ మండల పరిధి రంగశాయిపేటలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం.. మంత్రి కొండా సురేఖ పట్టుదలతో చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. వరంగల్ జిల్లా కేంద్రంలో టెక్నికల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి సోమవారం అంగీకారం తెలిపింది. ఈ టెక్నికల్ సెంటర్ భవన నిర్మాణం, ప్లాంట్, యంత్రాల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. నగరంలో స్థాపించనున్న ఈ సెంటర్‌ను విశేషమైన సామర్థ్యంతో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అధునాతన సాంకేతికతను సమకూర్చడం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల సృష్టి, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక, వ్యాపార సలహాలు అందించడం వంటి అంశాల్లో ఈ టెక్నికల్ సెంటర్ ప్రధాన పాత్ర పోషించనుంది. పలు రకాల పరిశ్రమలకు అవసరమైన సేవలను అనుసరించి టెక్నికల్ సెంటర్ శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. నిర్మాణ, ఎలక్ట్రికల్, ఫౌండ్రీ లెదర్, గ్లాస్, స్పోర్ట్స్ వంటి వివిధ రంగాలు టెక్నికల్ సెంటర్లు సేవలను అందిస్తాయి. టక్నికల్ సెంటర్ ఏర్పాటు వరంగల్ జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలువనుంది. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే హబ్ ఏర్పాటు ప్రకటనతో వరంగల్ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుదలతో వరంగల్ టెక్నికల్ సెంటర్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించిన మంత్రి సురేఖను ప్రజలు అభినందనలు తెలిపారు.

కేయూ పాలకమండలి సమావేశం



కేయూ క్యాంపస్: కేయూ పాలకమండలి సమావేశాన్ని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నత విద్యా కమిషనర్ బుర్రా వెంకటేశం, ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొన్నట్లు సమాచారం. ఇటీవల కేయూ రిజిస్ట్రార్, ఇతర పరిపాలనాపదవుల్లో పలువురు ప్రొఫెసర్లను నియమించిన విషయం తెలిసిందే. వీరికి సంబంధించిన ర్యాటిఫికేషన్‌ను ఈసమావేశంలో పెట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీటెక్, ఎంటెక్ పరీక్ష ఫలితాల విడుదల



పరీక్షల ఫలితాలు చూపిస్తున్న వివిధ శాఖాధిపతులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ కిషన్‌పుర చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) యూజీ 3, 5 పీజీ 3 సెమిస్టర్, బీటెక్, బీఫార్మసీ 3, 5, ఎంటెక్. ఎం.ఫార్మసీ 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కులపతి డాక్టర్ సీహెచ్.వి.పురుషోత్తంరెడ్డి విడుదల చేశారు. యూజీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 9,69 మంది విద్యార్థు హాజరుకాగా.. 743 మంది, పీజీ 3వ సెమిస్టర్‌లో 234 మంది పరీక్షలకు హాజరుకాగా.. 203 మంది, బీటెక్, బీఫార్మసీ 3, 5వ సెమిస్టర్లలో 591 హాజరుకాగా 432 మంది, ఎంటెక్ 3వ సెమిస్టర్‌లో హాజరైన ఆరుగురు విద్యార్థులు, ఎం.ఫార్మసీ 3వ సెమిస్టర్‌లో హాజరైన 15 మంది ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.రవీందర్, ఓఎస్‌డి. డా.వీరవెంకటయ్య, ఆచార్యులు జి.శంకర్‌లింగం, వి.మల్లికార్జున్, ఎస్.కవిత, ఎస్.సుమ, ఎం.జగదీశ్వర్, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురి మృతి చెందారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు, ఆటో, కారు ఢీకొన్న ఘటనలో మరో యువకుడు, రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.




సాయిప్రసాద్ (ఫైల్)

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మెరుగు సాయిప్రసాద్ (24) ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బలంగా చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుచ్చయ్య–కమల దంపతుల కుమారుడు సాయిప్రసాద్ గ్రామంలోనే ఫొటోస్టూడియో ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం కాజీపేట మండలం వనమాలకనపర్తిలో ఫొటోలు తీసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చే ముందు భార్య శ్రీవాణికి ఫోన్ చేశాడు. అర్ధరాత్రి అవుతున్నా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి బుచ్చయ్య ఫోన్‌చేయగా రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయలేదు. దీంతో ప్రోగ్రాంకు పిలిచిన వారికి ఫోన్ చేసి అడుగగా ఎప్పుడో వెళ్లాడని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, మిత్రులు వనమాల కనపర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో ద్విచక్రవాహనం కనిపించింది. వెంటనే సాయిచంద్‌ను లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్థికసాయం అందించిన జిల్లా ఫొటోగ్రాఫర్లు

తోటి ఫొటోగ్రాఫర్ మృతి చెందిన విషయం తెలియగానే సోమవారం సాయంత్రం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయంగా రూ. 10 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ పాశం శిరీష సురేష్, కర్ణకంటి వెంకటేశ్, చాగంటి మణి, కేరపాటి సాంబయ్య, అనిల్, సంఘం జిల్లా కార్యదర్శి కర్ణకంటి నాగరాజు, కీర్తి ప్రవీణ్, సంతోష్, అన్వేష్, గంటె ఉపేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కాసిరాజిగూడెం సమీపంలో వ్యక్తి..



జానీ మృతదేహం

డోర్నకల్: మహబూబాబాద్, ఖమ్మం జిల్లా సరిహద్దులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ముల్కలపల్లికి చెందిన ఎండీ జానీ(45) ఖమ్మం బైపాస్‌లో పాన్‌షాప్ పెట్టుకుని అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఖమ్మం రూరల్ మండలం కాసిరాజిగూడెం నుంచి ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా కాసిరాజిగూడెం సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జానీని ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో, కారు ఢీ.. యువకుడి దుర్మరణం



శ్రీకాంత్ (ఫైల్)

కురవి: ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం రాత్రి జరిగిందని సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడకు చెందిన బాష్పంగు శ్రీకాంత్(28) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆటోను నడుపుకుంటూ మహబూబాబాద్ నుంచి మరిపెడకు వెళ్తున్నాడు. మహబూబాబాద్‌కు చెందిన వెన్నం వెంకటేష్ కారును నడుపుకుంటూ హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా కొత్తూరు(సీ) శివారు గుజిలి తండా సమీపంలోని రైస్‌మిల్లు వద్ద 365 జాతీయ రహదారిపై ఢీకొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు కాగా మహబూబబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి బంధువు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

డోర్నకల్: గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన కోతుల వెంకన్న(60) పశువులను మేపేందుకు సోమవారం గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపానికి వెళ్లాడు. ఈ క్రమంలో కిలోమీటర్ నంబర్ 245 వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

అధికారుల సూచనలు పాటించాలి



మహాముత్తారం: రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సతీష్ అన్నారు. సోమవారం మండలంలోని ప్రేమ్‌నగర్, పెగడపల్లి గ్రామాల్లోని వరి పంటను ఆయన పరిశీలించారు. కొన్ని గ్రామాల్లోని వరి పొలాల్లో అగ్గితెగులు ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణ కోసం తెగులు తగ్గుముఖం పట్టేవరకు యూరియా వాడకంను ఆపివేయాలని రైతులకు సూచించారు. అదే విధంగా పొలంలో, పొలంగెట్లపై ఉండే కలుపు తీసివేయాలని తెలిపారు. అధికారుల సూచన మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు. పొట్టదశలో ఎకరానికి 25కేజీల పోటాష్ ఎరువులను కచ్చితంగా వేయాలని రైతులకు సూచించారు.

స్వయంఉపాధిపై అవగాహన



భూపాలపల్లి రూరల్: రక్షణ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో సోమవారం భూపాలపల్లి అంబేడ్కర్ సెంటర్ మహిళలు, గృహిణులకు సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పేపర్ ప్లేట్ల తయారీ విధానం, చెప్పుల తయారీ, టైలరింగ్, క్యాండిల్ తయారీ, హౌస్ క్లీనింగ్ స్టిక్‌తయారీపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో ఆర్గనైజర్ రమాదేవి యాదలక్ష్మి, సుమలత, శిరీష, రజిని నిరుద్యోగ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతుకు అస్వస్థత



వరంగల్: భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చిలుపూరు గ్రామానికి చెందిన మహిళా రైతు చిర్ర రమణక్క సోమవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో శ్వాస ఇబ్బందితో అస్వస్థతకు గురై యార్డులోని బస్తాలపై పడిపోయింది. కాగా, మార్కెట్‌లోని మిర్చి యార్డును సందర్శనకు వచ్చిన తెలంగాణ రైతు సంఘం నాయకులు మార్కెట్‌లోని ప్రథమి చికిత్స కేంద్రంలోని డాక్టర్‌ను పిలిపించి ప్రథమ చికిత్స చేయించి అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. ఆమెతో వచ్చిన రైతులను విచారించగా ఎకరంలో మిర్చి సాగు చేయగా కేవలం 11బస్తాలు దిగుబడి రావడం, వాటిని అమ్మితే వచ్చే డబ్బులతో అప్పులు తీరే అవకాశాలు లేక పోవడంతో ఆందోళనకు గురై పడిపోయిందని రైతు సంఘం నాయకులు తెలిపారు. అలాగే మార్కెట్ ఆవరణలో రైతుల కోసం పీహెచ్‌సీ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చిట్యాల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని వెంచరామి గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించే విధంగా సహకరించాలని గ్రామస్తులను కోరారు. అనంతరం మండలంలోని జూకల్ గ్రామంలో క్రికెట్ క్రీడోత్సవాలను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జెడ్పీటీసీ ఓరం సమ్మయ్య, మాజీ సర్పంచ్ మల్లేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

భూపాలపల్లి రూరల్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో మొగుళ్లపల్లి మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్ నేతృత్వంలో మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీకి కాలం చెల్లడంతో ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు ద్వితీయ శ్రేణి నాయకులు క్యూ కడుతున్నారన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగిస్తుందన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి



మాట్లాడుతున్న ఎంపీపీ యార సుజాత

మొగుళ్లపల్లి: లింగ వివక్షను రూపుమాపాలని ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ఇస్సిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ హాజరై మాట్లాడారు. బాలికలు బాగా చదువుకొని సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మగవాళ్లతోపాటు సమానంగా ఆడవాళ్లు కూడా అభివృద్ధి చెందాలని అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా బేటి బచావో బేటి పడావో నినాదంతో బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతపై ప్రజలకు అవగాహనను పెంపొందించి, బాలికలకు చట్టపరమైన హక్కులను, నాణ్యమైన విద్య, వైద్యం, పోషకాహారాన్ని అందించి వారిని బాల్య వివాహాల వంటి సామాజిక దురాచారాలకు చాలామంది బాలికలు గురవుతున్నారని అన్నారు. కొందరు తల్లిదండ్రులు ఇప్పటికీ పిల్లలకు బాల్య వివాహాలు చేస్తున్నారని అది సరైంది కాదని, చట్ట రీత్యా నేరమని అన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహం చేయొద్దన్నారు. బాల్య వివాహల వల్ల వచ్చే నష్టాలను గురించి వివరించారు. అనంతరం బాలల సంరక్షణ అధికారి రాజ కొమురయ్య మాట్లాడుతూ.. బాలురతో పాటు బాలికలకు సమాన అవకాశాలు అందించి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే బాలల చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, ఎంపీఓ వీరస్వామి, హెచ్‌ఎం రాజేశ్వరి, పంచాయతీ సెక్రెటరీ సునీల్, ఏఎన్‌ఎం మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ బి.మమత అకౌంటెంట్ సురేష్, సీహెచ్‌ఎల్ సూపర్‌వైజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్

భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్పొరేటు విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బందు సాయిలు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు బీజేపీ మతతత్వ విధానాలను, ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ ఎండగడుతూ ప్రచారం చేయాలన్నారు. కార్మిక సంఘాలు ప్రజా సంఘాలు అందరు కూడా దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వెలిశెట్టి రాజయ్య, వంగాల లక్ష్మి, కొండపాక రజిని, రాజేందర్, స్వాతి, శేఖరు, రవికుమార్, రోజా, శారద పాల్గొన్నారు.

గోవిందరావుపేట : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ,కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జాతీయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయు) జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ కార్మికులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పస్రా గ్రామంలో శ్రామిక భవనంలో ముమ్మడి ఉపేంద్ర చారి అధ్యక్షతన సీఐటీయూ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఐలయ్య పాల్గొన్నారు.

ములుగు రూరల్: ఈనెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా చేపట్టిన సుదీర్ఘ పోరాటంలో 750 మంది రైతులు మరణించారని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీఇచ్చి అమలు చేయడం లేదని అన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

అఖిల భారత సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో అంగన్‌వాడీలు పాల్గొంటామంటూ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, డీడబ్ల్యూఓ ప్రేమలతలకు సమ్మె నోటీసు అందించారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అధికారులకు నోటీసులను అందజేశారు. మోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలో అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆశ వర్కర్లను చేర్చుతామని బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆర్థికమంత్రి చేసిన ప్రకటన హాస్యాస్పదమని అన్నారు.

జాతర పనుల పరిశీలన



జాతర పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

చిట్యాల: మండలంలోని వెంచరామి శివారు పురేడు గుట్ట వద్ద శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రామయ్య కోరారు. సోమవారం జాతర పనులను ఎంపీడీఓ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్

ములుగు రూరల్ : కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండబోయిన రవిగౌడ్ అన్నారు. సోమవారం మేడారం మహా జాతర సమీక్ష సమావేశానికి వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లను శాలువాలతో సన్మానించి వినతిపత్రం అందించారు. అనంతరం రాష్ట్ర మంత్రులు నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, కుమార్, అశోక్, ముంజాల భిక్షపతి, రంజిత్ కుమార్ ఓడ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులదే కీలకపాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సధాకర్

రేగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు దుస్స సధాకర్ అన్నారు. సోమవారం పీఆర్టీయూ టీఎస్ మండల నాయకులు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రులందరూ విధిగా ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి సూదం సాంబమూర్తి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు ఓటరుగా నమోదు చేసుకుని రాబోయే శాసన మండలి ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలన్నారు. తద్వారా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలకు మార్గం సుగుమం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒంటేరు చంద్రశేఖర్, కృష్ణ, కుమారస్వామి, శ్రీధర్, దామోదర్, చక్రధర్, శిరీష, కల్పన, రజిత, ప్రసాద్, రాజేందర్, కోటిలింగంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మహాముత్తారం: ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో రోజుకు 20 మంది తగ్గకుండా కూలీలను వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కూలీల సంఖ్య తగ్గితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

ముగిసిన ఉపాధిహామీ ప్రజావేదిక

- రూ.7లక్షలకు పైగా రికవరీకి ఆదేశం



వివరాలను వెల్లడిస్తున్న సోషల్ ఆడిట్ బృందం

టేకుమట్ల: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌పై శని, సోమవారాల్లో ఎంపీడీఓ అనిత, ఏపీఓ మాధవి ఆధ్వర్యంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు, ఉపాధి పనుల్లో తీసిన కాలువల పనుల్లో రూ.7లక్షలకు పైగా అవినీతి నిరూపన కావడంలో బాధ్యు అధికారులపై నగదు రికవరికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ అవినాష్, ఎస్‌టీఎం వేణు, డీవీసీ రుబీనా, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండు కోర్టుల ఏర్పాటు!

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధిలో రెండు కోర్టులు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు తెలంగాణ హై కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా జడ్జీ నారాయణబాబు కోర్టుల ఏర్పాటుకు కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొనసాగేవి. జిల్లాల పునర్విభజనలతో భాగంగా కాటారం సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాలతో పాటు అప్పట్లో నూతంగా ఏర్పడిన పలిమెల మండలం జయశంకర్ జిల్లాలో విలీనం అయ్యాయి. దీంతో కాటారం సబ్ డివిజన్‌లోని ఐదు మండలాలు పరిపాలన విభాగంతో పాటు జ్యూడిషియల్ విభాగం జయశంకర్ జిల్లా నుంచే కొనసాగుతుంది. ఈ మండలాల్లోని ఏ కేసులైనా జిల్లా కోర్టు పరిధిలోకే వెళ్తుండటంతో కాటారం సబ్ డివిజన్‌లో ప్రత్యేకంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు గతంలో వచ్చాయి. దీంతో సానుకూలంగా స్పందించిన హైకోర్టు జూనియర్, సివిల్ కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. కాగా కాటారంలో సీనియర్ జడ్జి, మహదేవపూర్‌లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఏర్పాటు చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా జడ్జి ఆదేశాల మేరకు రెండు మండలాల్లో కోర్టు ఏర్పాటు చేయడానికి భవనాల కోసం అధికారులు పరిశీలన జరుపుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అద్దె తాత్కాలికంగా భవనాల్లో కోర్టులు నిర్వహించేలా అధికారులు సమయత్తం అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా ఐదు మండలాలకు సబ్ డివిజన్ కేంద్రంగా ఉన్న కాటారంలోనే రెండు కోర్టులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చివరి రోజుల్లో కాటారంలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేసిన విషయం విధితమే. కోర్టులు సైతం కాటారంలోనే ఏర్పాటు చేస్తే ఐదు మండలాలకు విస్తృత సేవలు అందుతాయని పలువురు పేర్కొంటున్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు



రోడ్డు పైనే నిలిచిన మురుగు నీరు

వెంకటాపురం(కె): స్థానిక బస్టాండ్ సమీపంలోని జక్కలవారి వీధిలో ఉన్న రోడ్డుపై మురుగునీరు నిలుస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురికి కాల్వల్లో చెత్త పేరుకు పోవడంతో ఇళ్లలో వాడిన నీరు రోడ్లపైకి చేరి కంపు కొడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై వెళ్లేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన మురుగునీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసుల అవతారంలో వైన్‌షాపు నిర్వాహకులు!

టేకుమట్ల: మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపులను నిర్వహించడమే కాకుండా షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ఎక్సైజ్, సివిల్ పోలీసుల అవతారం ఎత్తి మద్యం, గుడుంబాను పట్టుకుని ఎక్సైజ్ పోలీసులకు అందజేస్తూ కేసులు పెట్టిస్తున్నారు. గత యేడాది మండలంలో రెండు వైన్‌షాపులకు అనుమతి లభించగా ఒకటి టేకుమట్లలో, మరొకటి వెలిశాల కాగా నిబంధనలకు విరుద్ధంగా వెలిశాలలో ఏర్పాటు చేసిన వైన్‌షాప్‌ను మండల కేంద్రానికి మర్చారు. ఎక్సైజ్ అధికారుల అండదండలతో మద్యాన్ని గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. యథేచ్ఛగా నిరంతరం ఆటోల్లో మద్యాన్ని బెల్ట్‌షాపులకు తరలిస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా ఎక్సైజ్ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాపులకు మండల కేంద్రంలోని రెండు వైన్‌షాపులు సిండికేట్‌గా మారి ఒక షాప్ నుంచి రిటేల్, మరో షాప్ నుంచి ప్రత్యేక కౌంటర్ ద్వారా కేవలం బెల్ట్‌షాపులకు ప్రత్యేక స్టిక్కర్లను అంటించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ప్రజలు తెలుపుతున్నారు. గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో ప్రత్యేక స్టిక్కర్లు అంటించిన మద్యాన్ని విక్రయించేలా వైన్ షాప్‌లు ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక బృందం ప్రతీ రోజు పర్యటిస్తూ అన్ని బెల్ట్‌షాపుల్లో తనిఖీలు చేపడుతున్నారు. వైన్‌షాప్ వారు అంటించిన ప్రత్యేక స్టిక్కర్ లేని మద్యాన్ని స్వాధీన పర్చుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతే కాకుండా బెల్ట్‌షాపుల్లో మద్యంతో పాటు కొంతమంది గుడుంబాను బెల్ట్‌షాప్ నిర్వాహకులు సైతం విక్రయిస్తుండడంతో గుడుంబాను సైతం స్వాధీన పర్చుకుని రహస్యంగా ఎక్సైజ్ పోలీసులకు అప్పగించి మరో రోజు ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నట్లు వెల్లడిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సంఘటన ఇటీవల మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకున్నట్లు సమాచారం. అలాగే సోమవారం మండల కేంద్రంలోని ఓ బెల్ట్‌షాపులో వైన్‌షాప్ సిబ్బంది తనిఖీలు చేపట్టి అనధికారికంగా గుడుంబాను స్వాధీన పర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎక్సైజ్ పోలీసులు, వైన్‌షాప్ నిర్వాహకులు కుమ్మక్కై ఇష్టారీతిన వ్యవహరించడంపై మండలంలో చర్చ కొనసాగుతోంది.

సమాధులకు రక్షణ కరువు

- జంపన్నవాగు నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు
- కూలిపోతున్న సమాధులు



ట్రాక్టర్ల రవాణాతో పునాదులు బయటకు వస్తున్న సమాధి

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జంపన్న వాగుకు ఆనుకుని ఉన్న సమాధులకు రక్షణ కరువైంది. తాత, ముత్తాతల నుంచి శ్మశానవాటికగా వాడుతున్న వాగులో అక్రమ ఇసుక తవ్వకాలతో పూర్వకాలం సమాధులు అంతరించిపోతున్నాయి. సమాధులు ఉన్న వాటి నుంచి అదనపు లోడ్‌తో అతివేగంగా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండడంతో సమాధులు చెదిరిపోయి కూలిపోతున్నాయి. కుటుంబసభ్యులు వారి తండ్రి, తల్లి, తాతలను గుర్తించుకొని ప్రతి ఏటా స్మరించుకునేందుకు గుర్తుగా నిర్మించుకున్న సమాధులను ఛిద్రం చేసే విధంగా ట్రాక్టర్ డ్రైవర్లు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఐదుఫీట్ల లోతుల్లో తవ్వకాలు

గ్రామంలో ఎవరూ మృతిచెందిన ఏటూరునాగారం జంపన్నవాగులో నుంచి శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లడం ఆనవాయితీ. వాగును దాటి శ్మశాన వాటికకు వెళ్లే దారిలో ఇసుక తవ్వకాలతో ఐదు ఫీట్ల మేర ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. రెవెన్యూ అధికారులు వాగులో ఎలాంటి హద్దులు కేటాయించలేదు. ఇష్టానుసారంగా తవ్వకాలతో గుంతల ప్రమాదబరితంగా మారి అంతిమయాత్రలో సైతం పాడేను మోయలేని పరిస్థితి నెలకొంది. ఇలా అయితే మృతదేహాలను సైతం ఒకరిపై ఒకరిని పేర్చి




ఐదు ఫీట్లలోతులో తవ్విన ఇసుక



సమాధుల మధ్యలో నుంచి సాగిస్తున్న రవాణా

దహనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాకుండా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. సూర్యరశ్మికి ఇసుక రేణువులు లేకపోవడంతో నీటి నిల్వలు ఆవిరై పోతున్నాయి. ఇలా కొనసాగితే జంపన్నవాగు ఎడారిగా మారే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతిధులు స్పందించి శ్మశాన వాటికలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి తవ్వకాలు జరపకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న డాక్టర్ వివేక్

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన సల్పాల కొమురమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను పశువైద్యాధికారి వివేక్ సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, రూ.10వేల ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. ఆయన వెంట గోపాలమిత్ర మేకల కుమార్, యాదవ సంఘం నాయకులు గొర్ల కుమార్, రాజకొమురు, కొడారి సదయ్య, కొడారి ఐలయ్య, తదితరులు ఉన్నారు.